
గుమ్మంలో రిక్షావచ్చి ఆగేసరికి గతుక్కుమంది సావిత్రి. 'తెల్లారేసరికి ఎవరొచ్చారు చెప్మా?" అని ఆలోచనల్లో పడింది.

రావలసిన వాళ్ళంతా రానే వచ్చారు. వీళ్ళ తోటే వేగలేకపోతూంటే వీళ్ళకి తోడు ఇంకా ఎవరొస్తున్నారు?" అనిపించింది. ఆమె ఆలోచనలలా వుండగానే పాల కోసం వెళ్ళిన చిన్న కొడుకు వీధిలోంచి వస్తూ "అమ్మా! పాలింకా తియ్యలేదట. అరగంట పోయాక రమ్మన్నారు" అన్నాడు ఖాళీ గిన్నె అక్కడ పెట్టి. అంతలోనే ఏదో గుర్తొచ్చిన వాడిలా "అమ్మా! ఎవరోచుట్టాలొచ్చారే!" అన్నాడు.

ఎవరో ఒకరు చుట్టాలు వస్తూండడంతో సరదాగా వుంటోంది వాడికీమధ్య. ఎందుకంటే వాళ్ళు వెళ్ళేటపుడు ఎంతో కొంత డబ్బులు వాడికిస్తున్నారు. అదీ వాడి సరదా.

ఆ మాటకి పరధ్యానంగా "ఊс..." అని మాత్రం అని ఉరుకుంది. ఆమె మనసులోని భావాన్నర్థం చేసుకోలేదా కుర్రాడు. అందుకే "అది కాదే! వాళ్ళతో ఇద్దరు పిల్లలు కూడా వచ్చారే. ఎంచక్కా ఆడుకోవచ్చు" అన్నాడు. ఆ మాటతో గుండెల్లో రాయిపడింది శారదకి. ఆ బాధని బయటపడనీయకుండా "సర్లే..." అని మాత్రం అనగలిగింది.

తల్లి పరిస్థితినర్థం చేసుకోలేని ఆ కుర్రాడు "అమ్మా! ఎంచక్కా తాతగారికిలాగే జబ్బు తగ్గకుండా వుంటే బాగుణ్ణుకదే? ఎంచక్కా బోల్డు



# ఓ ఇం(టి)తి కథ

మంది చుట్టాలొస్తారు" అన్నాడు.

ఆ మాట వాడి నోటంట వెలువడిందో లేదో, వాడి వీపుమీద అయిదు వేళ్ళూ అచ్చు పడిపోయినట్లు పడింది దెబ్బ. అంతలోనే వీధి లోంచి గట్టిగా ఏడుపు వినిపించింది.

"తను కొడుకుని కొట్టింది. వాడిక్కడే వున్నాడు. మరి ఏడుపు వీధిలోంచి వస్తోందేమిటి చెప్మా?" అని ఆశ్చర్యపోతున్నంతలో మరింత బిగ్గరగా వినిపించింది ఏడుపు.

"మామయ్యా! దేవుడు నీకింత అన్యాయం చేస్తాడనుకోలేదు. నీకేమంత వయసైపోయిందని ఆ దేవుడికి నీమీద కన్నుపడింది?" అంటూ ఇంకేవేవో రాగాలతో ఏడుస్తూ లోపలి కొస్తున్న ఆ ఆడమనిషిని చూస్తూనే సావిత్రికి భయంతో పాటు చిరాకు కూడా వేసింది. ఆ వచ్చినావిడ తన మామగారికి వేలు విడిచిన చుట్టరికం. బాగా దూరపు చుట్టరికమనే చెప్పాలి. అది చూసిన సావిత్రి కర్తవ్యం గుర్తొచ్చిన దాన్లా పరిగెత్తుకుంటూ ఆ వచ్చినామె దగ్గరకెళ్ళి ఓదార్చడం కోసం ఆమెను పట్టుకుంది. సావిత్రిని చూస్తూనే ఆమె. "అక్కా..." అంటూ దీర్ఘం తీస్తూ ఏడుపు మొదలెట్టి మామయ్యకిలా... అంటూ పెంచింది.

ఆ మాటలకి సావిత్రి "ఊర్కో సుగుణా! మామయ్యకేమీ కాలేదు. బాగానే వుంది" అంది. ఆమె మీద ప్రేమకన్నా ఆవిడగోల భరించలేక పోవడంతో అడ్డుకట్ట వేయడానికి. అయినా సుగుణ ఏడుపాపటం లేదు. అది ఓవరేక్షన్ అనిపించింది సావిత్రికి. కానీ ఏమీ అనలేని పరిస్థితి.

"నా డబ్బులియ్యండమ్మా! నా కవతల బేరాలున్నాయి" అన్నమాట విన్పించి వీధి వైపు చూసింది సావిత్రి. రిక్షావాడిలావున్నాడు. అంటే ఈవిడ డబ్బులివ్వలేదన్న మాట. ఈవిడ సహజ లక్షణం చూపడం అప్పుడే మొదలెట్టిందన్న మాట" అనుకుంటూండగానే...

"ఇస్తాన్లేరా బోడి డబ్బులు. నీ డబ్బులేమైనా తినేస్తానా ఏంటి? నాలుగడుగుల దూరానికి పదిహేను రూపాయలు గుంజుతున్నావ్. ఆ మాత్రం ఆగలేవేంటి? చిల్లర లేదన్నానా?" అంది ముక్కు ఎగబీలుస్తూ.

అంతవరకూ ఆమె ప్రవర్తనను భరించి భరించి వున్నాడ్లా వుంది... ఇక ఆ మాటలు వినగానే ఆగలేక "చాల్లేయమ్మ! ఒరే, గిరే అంటే పడ్డానికిక్కడెవుల్లేరు. తెల్లారేసరికి మాగొప్పోటి బేరం తగిల్నాది. నీనాటి బేరాలు రెండు తగిల్తే శాన. అంటూ కొన్ని బూతుల్ని కలిపి వరుసగా నాలుగు తిట్లు తిట్టి డబ్బు లిమ్మన్నాడు.

ఆ మాటకావిడ సావిత్రి వైపు తిరిగి ఈ వెధవలింతే అక్కా! నా దగ్గర చిల్లరలేదు. ఓ పదిహేను రూపాయలుంటే వాడి మొహాన కొట్టు..." అంది అక్కడికేదో ఆమె సొమ్ము కట్టకట్టి ఈమె దగ్గర దాచినట్టు.

ఆ మాటవిన్న సావిత్రి చేసేది లేక బీరువా లోంచి ఏభై కాగితం తీసి ఆమె కిస్తూ "చిల్లర లేదు సుగుణా! వాడ్నే ఇమ్మను" అంటూ అందించింది.

అయ్యగారి శ్రీనివాసరావు

అదందుకున్న ఆమె పక్కనేవున్న వాళ్ళ కుర్రాడికా నోటిస్తూ "ఒరేయ్ చిన్నా! రిక్షావాడి మొహాన పదిహేను రూపాయలు కొట్టి, నువ్వూ తమ్ముడూ పది రూపాయలు టిఫిన్ చేసి, మిగిలిన డబ్బులు పట్రండ్రా" అంటూ సావిత్రి వైపు తిరిగి "చంటి వెధవలు ఆకలికాగ లేకపోతున్నారక్కా. ఇందాకట్నుంచి ఒకటే గోల" అంది. అదేదో పెద్ద ఘనకార్యమైనట్టు.

ఆ చర్యతో ఆమె చొరవకి చికాకేసినా అణచుకుని, "పిల్లలకి చల్దన్నాలు వున్నాయి సుగుణా. టిఫిన్లెందుకు?" అంది అప్పటికీ.

ఆ మాటవిన్న సుగుణ "మా పిల్లలు చల్దన్నం తినరక్కా. వాళ్ళకి పడదు. వాళ్ళకి చిన్నప్పట్నుంచీ టిఫిన్ అలవాటు" అంది దీర్ఘం తీస్తూ.

ఆ మాటకి ప్రసారసమాప్తి అయిన రేడియోలాగా అయిపోయింది సావిత్రి. పైకనలేకపోయినా మనసులో మాత్రం "ఔన్లే నమ్మేవాళ్ళుంటే నాది నార్తమెరికా!! అనే తత్త్వంనీది. నీ సంగతి నాకు తెలియకపోతే కదా?" అనుకుంది.

ఇంతలో "వదినా! టేంక్ నిండిపోయినట్టుంది. నీళ్ళు పొర్లిపోతున్నాయి. మోటారు కట్టేయ్" అంటూ లోపల్నుంచి కేకవేసింది ఆడబిడుచు. ఆమె కూర్చున్న గదిలోనే స్విచ్ వున్నా, దూరంగా వున్న తనని పిలిచిన ఆడబడుచు తత్వాన్ని తలచుకుంటూ "మా గొప్ప ఆడదానివి సుమీ" అనుకుంది.

ఇంతలో అక్కడికొచ్చిన భర్త "సావిత్రీ! ఎంతసేపైంది కాఫీ అడిగి? ఏం చేస్తున్నావ్?" అన్నాడు.


ఆ మాటకి సమాధానం చెబుదామనుకుంటున్నంతలోనే "ఒసేవ్! సావిత్రీ! వేన్నీళ్ళు పెట్టమన్నాను పెట్టావే" అని అతడి తల్లి. ఆమె మాట పూర్తికాకుండానే "వదినా పాలుకి పంపించావు కదా! వచ్చాయా? పిల్లాడికి హార్లిక్స్ కలపాలి." అంటూ అతని చెల్లెలూ అడగడం వినిపించి, భార్య పరిస్థితినర్థం చేసుకుని, ఏమనలేక వెనుదిరిగిపోయాడతడు.

అతడటు వెళుతూండగానే పనిమనిషి కొడుకు వచ్చి "మాయమ్మకి జొరం. ఈ పొద్దు రానంది." అంటూ చావు కబురు చల్లగా చెప్పాడు.

ఆ మాటవిన్న తోడికోడలు "ఈ పని మనుషులెప్పుడూ ఇంతేనక్కా. ఇంట్లో మను షుల్ని చూసి వేషాలేసి రావడం మానేస్తారు. అందుకే నేను మా వూళ్ళో అదెన్ని రోజులు రాకపోయినా అంట్లు అలాగే వుంచుతానుగానీ తోమను. అసలు అంట్లు తోమడమంటే నాకు పరమచిరాకు సుమీ!" అంది. "నాకు మాత్రం చెప్పకు" అన్న ధ్వని వచ్చేటట్లు. ఆ పని తనకెక్కడ చుట్టుకుంటుందోనని ముందు జాగ్రత్తపడుతూ. అందరి మాటలూ వింటూ అందరి మనస్తత్వాలూ తెలిసినది కావడంతో ఎవరికి తగినట్లు వారి అవసరాలు తీరుస్తూ నిర్లిప్తంగా అన్ని పనులూ చేసుకుపోతోందామె అష్టావధానం చేసే అవధానిలా.

ఆ యింటికి పెద్ద కోడలు కావడమూ, ఆపై నెమ్మదస్థురాలు కావడంతోనూ దేని నుంచీ తప్పించుకోలేకపోతోంది సావిత్రి.

ఇప్పుడూ అదే జరుగుతోంది. ఆమె మామగారికి ఈ మధ్య జబ్బు చేసింది. చాలా హాస్పిటళ్ళకి తిరగవలసొచ్చింది. రాకపోకలకి, డాక్టర్లకి, మందులకీ ఇతర ఖర్చులకీ చాలా ఖర్చయింది సావిత్రి భర్త కైలాసంకి. అదేం జబ్బోగాని... హాస్పిటల్‌లో వున్నన్నాళ్ళూ బాగానే




వుంటోంది. ఇంటికి తీసుకువచ్చేసరికి మళ్ళీ ఏదో ఒక కొత్త సమస్య ఉత్పన్నమౌతోంది. దాంతో మళ్ళీ రాకపోకలు, మరింత ఖర్చు. డబ్బంటే అప్పోసప్పో చేస్తారుగానీ వచ్చిన చిక్కల్లా చుట్టాలతోటే వస్తోంది. మామగారికి బాగులేదని తెలిసిన దగ్గర్నుంచి ఆమె తోడి కోడళ్ళు, మరుదులు, ఆడబడుచులు, వాళ్ళ భర్తలు, అత్తగారి వంక చుట్టాలు, మామగారి వంక బంధువులు... వీళ్ళందరి అవసరాలూ తీర్చడంతో ఊపిరిసలపడం లేదు సావిత్రికి. అది చాలదన్నట్టు వారంతా ప్రవర్తించే తీరు, ప్రదర్శించే మధ్య తరగతి బేషజాలు, మనస్తత్వాలతో సతమతమౌతోంది.

ఒక పక్క మామగారి మంచి చెడ్డలు చూడాలి. అత్తగారున్నా ఆవిడ ఏ మాత్రం సాయం చెయ్యకపోగా తిరిగి సాధింపులు మొదలెడుతుంది. భర్తకి అంతలా జబ్బు చేసినా కనీసం ఏ బాధ్యతా తీసుకోకుండా మీదు మిక్కిలి వచ్చిన కూతుళ్ళకు, అల్లుళ్ళకూ మర్యాదలు చేయలేదని సావిత్రిని సాధిస్తోంది. అంతేకాకుండా ఎంతసేపూ ఆమె అవసరాలు, కోడలు మీద అధికారం చలాయించడం తప్ప మరో పని లేదామెకి. అయినా ఓపికైన ఇల్లాలు కాబట్టి సావిత్రే అన్నీ చూసుకుంటోంది. ఒకటి రెండు రోజుల కోసం వచ్చిన బంధువులకి పని చెబితే బాగుండదు కాబట్టి ఇంటికింటెడు చాకిరీ చేసుకుంటూనే వచ్చిన వాళ్ళకు మర్యాదలు చూస్తోంది. అన్నిరకాలుగా జాగ్రత్తగా చూస్తున్నా ఏదో ఒక మాట ఎవరో ఒకరు విసురుతూనే వున్నారు. ఒకరు వెళ్ళేసరికి మరొకరు. ఆమె పడుతున్న కష్టాన్ని గుర్తించకపోగా ఆడబడుచులు, తోడికోడళ్ళు, మర్యాదలు చాల్లేదంటూ మూతి విరుపులు విరుస్తూనే వున్నారు.

మొన్న జరిగిన సంఘటన ఆమె మనసులో ఇంకా పచ్చిగానే వుంది. గుర్తొచ్చినపుడల్లా ముల్లులా హృదయాన్ని పొడుస్తూనే వుంది. అయినా కన్నీరు పెట్టడానికి కూడా అవకాశం

లేక లోపల్లోపలే కుములుతోంది.

ఆ మధ్య రెండు రోజులు కొళాయిలు రాలేదు. ఆ రోజే వచ్చింది. అరగంటలో కట్టే స్తాడు. ఇంటినిండా చుట్టాలు. ఊపిరి సలపని పనితో వుండడంతో ఆడపడుచుతో "సుశీలా! పన్లో వున్నాను. కొంచెం నాలుగు బిందెలు నీళ్ళు పట్టు. ఈలోగా మామగారికి మందు లిచ్చేసి వచ్చేస్తాను!" అంది. కొళాయి కట్టేస్తే తాగడానికి మంచినీళ్ళుండవని ఆమె ఆతృత. అందుకే ఆడబడుచుకి చెప్పింది.

ఆ మాటవిన్న ఆడబడుచు సర్రుమని లేచింది. "మేమేమీ గతిలేక మీ ఇంటికి రాలేదు వదినా! నాన్నకి ఒంట్లో బాగులేకపోతే చూడడా నికి వచ్చాంగానీ మీ ఇంట్లో చాకిరీ చెయ్యడా నికి కాదు. నీకంత కష్టంగా వుంటే చెప్పు. వెళ్ళిపోతాను. అంతేగానీ ఇలా పనులు చెప్పి చిన్నబుచ్చడం మంచిది కాదు" అంది కోపం గానే. ఆ మాటవిన్న అత్తగారు కూడా కూతురి పక్కనే చేరి సావిత్రి మీద విరుచుకుపడింది.

అసలు తనన్న మాటలో ఏం తప్పుందో అర్థం కాలేదు సావిత్రికి. అయినా మరేమనలేక పోయింది. ఇంకేదో జరుగుతుందని ఊహిం చిన తోడికోడళ్ళిద్దరికీ నిరాశే ఎదురైంది. అంత జరుగుతున్నా ఇద్దరూ చోద్యం చూస్తున్నారేగానీ ఏ ఒక్కరూ బిందెడు నీళ్ళు పట్టలేదు. ఏమీ ఎరగనట్లే సావిత్రి దగ్గరకెళ్ళి వాళ్ళ మనసుల్లో వున్న కసినంతా తీరేటట్లు అత్తగారు, ఆడ బడుచుల మీద రకరకాల మాటలన్నారు. అంతటితో ఊరుకోకుండా సావిత్రితో "వాళ్ళం త లేసి మాటలంటూ వుంటే నువ్వెందుకూరు కున్నావ్? గట్టిగా ఇవ్వవలసింది. సంకటం కట్టిపోను" అంటూ ఇంకేవేవో అన్నారు ఆమెను రెచ్చగొడుతూ. ఆ మాటలకి సావిత్రి ఏమీ సమాధానం చెప్పకపోవడంతో వాళ్ళ పథకం పారనందుకు సావిత్రినే నాలుగు దులిపేసి అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

తోడికోడళ్ళ సంగతి పూర్తిగా తెలిసినది కావడంతో ఆమె మౌనం వహించింది. పొరబా టున నోరు జారిందా...! ఇక తన పరిస్థితి వర్ణింపతరం కాదు.

ఇలాంటి ఆలోచనలతో వున్న సావిత్రికి సుగుణ మాటలు వినిపించాయి. "ఈ రెండూ తిను మామయ్యా! ఏమీ అయిపోదు. మా వూరి స్పెషల్ స్వీట్ ఇది. అందుకే నీ కోసం ప్రత్యేకం గా తెచ్చాను" అని బలవంతంగా తినిపించబో తోంది. మామగారు వద్దంటున్నారు. అయినా సుగుణ వినడంలేదు.

అది చూసిన సావిత్రి గుండెల్లో రాయి పడింది. అతడికసలే షుగర్ వుంది. ఏ మాత్రం తీపి తగిలినా ప్రమాదం. అందుకే అతడిని తన పర్యవేక్షణలోనే వుంచుకుని జాగ్రత్తగా చూస్తోందిన్నాళ్ళూ. అలాంటిది ఇప్పుడు సుగుణ స్వీట్లు ఇవ్వబోతోంది. వద్దని అడ్డుపెట్ట లేదు, అలాగని తిననివ్వలేదు... అయినా తెగించి ఆమె దగ్గరకెళ్ళి, "సుగుణా! మామ గారికి స్వీటు పనికిరాదు" అంది డైరెక్ట్‌గా స్వీట్లు పెట్టవద్దని చెప్పకుండా.

ఆ మాటకి సుగుణ "ఫర్వాలేదు వదినా! ఒక్కటే కదా! ఏమైపోదులే! అంతగాకాకపోతే ఓ టాబ్లెట్ వేస్తే అదే సర్దుకుంటుంది" అంటూ ఎంత వారిస్తున్నా బలవంతం చేసి తినేవరకూ ఒప్పుకోలేదు. అది చూసిన సావిత్రి ప్రేక్షకురాలే అయింది తప్ప మరేం మాట్లాడలేకపోయింది.

అంతకన్నా సగటు మధ్య తరగతి ఇల్లాలేం చేయగలదు? ఎన్ని సమస్యలని బుర్రలో పెట్టు కుంటుంది? బావగారు, మరిది వచ్చి వాళ్ళకి

తోచిన సలహాలిచ్చి వెళ్ళిపోవడం తప్ప ఖర్చుల విషయంగాని, ఎలా చేస్తున్నావని గానీ అడిగిన పాపాన పోవటం లేదు. ఆ సలహాలు వింటూంటే వాళ్ళు ఆలోచించే ఇస్తున్నారా? అనిపిస్తోందప్పుడప్పుడూ. స్థోమత లేనివారా! అంటే లోటులేని జీవితాలే వారివి కూడా.

ఒకసారి అదేమాట భర్త దగ్గరంటే ఏ భావమూ వ్యక్తీకరించకుండా మౌనం వహించాడు. భర్తలో స్పందన లేకపోతే తను మాత్రం ఏం చేయగలదు? కానీ భర్త మౌనానికి కూడా కారణముందని, ఎవర్నీ ఏమీ అనలేని నెమ్మది తనమే అదని ఆమెకి తెలియదు.

ఒక్కొక్కరుగా అందరూ వెళ్ళిపోయేసరికి ఇల్లంతా బోసిపోయింది. తను, భర్త, అత్తగారు, మామగారే తప్ప ఇల్లంతా ఖాళీ. ఇంటి పరిస్థితి వాళ్ళంతా వెళ్ళాక గందరగోళంగా తయారైంది. రేషన్‌కి చుట్టాల కోసమే పన్నెండువేలు దాటింది. మందుల ఖర్చు పాతికవేలు పైనే. అదీకాక ఆడపిల్లలని, ఎప్పుడూ రాకరాక వచ్చిన వాళ్ళని వాళ్ళు వెళ్తున్నప్పుడు అత్తగారు చేసిన మర్యాదల కింద మరో ఐదారు వేలు. లెక్కల్లో కొచ్చినవి ఇవైతే... "వదినా ఈ స్టీలు గిన్నెక్కడ కొన్నావ్? చాలా బాగుంది. ఇలాంటి గిన్నె నేనెన్నిసార్లు ప్రయత్నించినా దొరకలేదు. ఇది నేను పట్టుకుపోతాను. నువ్వు మరోటి కొనుక్కో" అన్న ఆడబడుచు.

అలాగే మరికొన్ని వస్తువుల్ని అడిగి తీసుకుపోయిన కొందరు బంధువులు. అవి ఆ వూళ్ళలో నిజంగా దొరకకపోవనీ తెలుసు. కొనాలంటే పెద్ద ఖరీదూ కాదని తెల్సు సావిత్రికి. కానీ వారి మనస్తత్వం తెలిసి ఏమనలేని స్థితి. మధ్య తరగతి మందహాసం. అలా వస్తువులు భద్రంగా వెళ్ళినవి కొన్నైతే ఇష్టం వచ్చినట్లు ఎవరు బడితే వాళ్ళు ఆపరేట్ చెయ్యడం వల్ల రిపేర్ కొచ్చిన టీవీ, కోడు విరిగిపోయిన డైనింగ్ టేబుల్, సన్‌మైకా ఊడిపోయిన డబుల్ కాట్, రిసీవర్ విరిగిపోయి మాటలు సరిగా వినబడని ఫోన్. ఇలాంటి నష్టాలెన్నో... అవి లెక్కపెట్టాలో లేదో తెలియదు.

కాళ్ళూ చేతులూ ఆడటం లేదు సావిత్రికి. ఈ పరిస్థితుల్లో ఏం చెయ్యాలో తెలీటం లేదు. సమయానికి భర్త కూడా లేడింట్లో.

"నాన్నగారికి బాగానే వుంది కదా! ఒకవేళ ఏదైనా అవసరమైతే ఫోన్‌చెయ్యి" అంటూ ఆఫీసు పనిమీద హైదరాబాద్ వెళ్ళాడు. అత్తగారు కూడా "కూతురు చాలా రోజుల్నుంచి రమ్మంటోంది. ఎలాగూ కైలాసం వెళ్ళే తోవలోనే కదా దిగబెట్టిస్తాడు" అంటూ అతడితో బయలుదేరింది.

జబ్బు చేసిన మనిషి. ఏ క్షణంలో ఎలా వుంటుందోనని మనసులో ఒక పక్క భయంగా వున్నా, ఉండమని ధైర్యంగా చెప్పలేని సావిత్రి కోరుకుంటున్నదొక్కటే... అందరూ వెళ్ళిపోయి తనొక్కర్తే ఇంట్లో వున్న వేళ "మామగారికేమీ కానివ్వకు భగవంతుడా!" అని. అంతేకాకుండా అనుకోని విధంగా మామగారికేమైనా జరిగినా అంతమంది బంధువుల్ని రానివ్వకు దేవుడా!" అని.

అయినా ఆమె మొరాలకించలేదా భగవంతుడు. ఆమె భయపడినట్లే ఆమె ఒక్కతే వున్నపుడే మామగార్ని తీసుకుపోయాడు.

"బంధువులు వచ్చినా రాబందుల్లా మాత్రం ప్రవర్తించకుండే సద్బుద్ధి వారికి ప్రసాదించు స్వామీ" అని మౌనంగా భగవంతుడ్ని ప్రార్థిస్తోంది... అంతకంటే ఏమీ చెయ్యలేని ఆ మధ్య తరగతి ఇల్లాలు. ●